విద్యారంగ సమస్యల పరిష్కారానికై 25న విద్యాసంస్థల బంద్

ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25న విద్యాసంస్థలు బంద్ చేపట్టనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. విజయనగరంలో ఆదివారం స్థానిక అమర్‌భవన్ నందు విద్యార్థి సంఘాల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ. ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయల ఎదుట పెద్దఎత్తున మహాధర్నా కార్యక్రమాలు నిర్వహించామని, ఏఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఏఐఎస్ఏ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25న బంద్ కు పిలుపునిచ్చారన్నారు. రాష్ట్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు నాణ్యమైన భోజనం లేక, సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెరిగిన నిత్యావసరల ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని అనేక రూపాలలో ఆందోళన నిర్వహించిన ఈ ప్రభుత్వానికి చలనం లేదని వాపోయారు. అధికారంలోకి రాక ముందు జగన్మోహన్ రెడ్డి గారు అనేక హామీలు ఇచ్చి అధికారులకు వచ్చిన తర్వాత విద్యార్థుల్ని మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద ఇంటర్మీడియట్ విద్యార్థులకు గతంలో ప్రభుత్వం ఉచితంగా మెటీరియల్స్ ఇచ్చేవారని, కానీ ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెడుతున్న మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి చిప్పాడ మణికంఠ స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు చదువు చెప్పే వారు కరువయ్యారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 53వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం:77 వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద పీజీ విద్యార్థులు చదువుకోలేకపో తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. నూతన జాతీయ విద్యా విధానం వలన రాష్ట్రంలో వేల సంఖ్యలో స్కూల్స్ మూతపడ్డాయని 3,4,5 తరగతుల విలీనం వలన విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. విశ్వవిద్యాలయలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులను కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు . అనంతరం నాయకులందరూ బంద్ పోస్టర్ ను ఆవిష్కరించి, రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న జరుగుతున్న బంద్ ను జయప్రదం చేయాలని విద్యా సంస్థ యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ సునీల్ ఎన్ నాగభూషణం టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజిగ్ కార్యదర్శి పి కే ఎల్ రాజు ఏఐఎస్ఎఫ్ నాయకులు గౌరీ శంకర్, శ్రావణ్ కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్‌ను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణారావు

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం 10వ వార్డ్ గొల్లపల్లిలో వైసిపి కార్యకర్త గుజ్జు లక్ష్మణరావు కుమారుడు గుజ్జు నాగరాజు వార్డ్ వాలెంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు ఆదివారం పరామర్శించారు. అనంతరం వాళ్ళతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం కింద రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. పురపాలక సంఘం శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న శానిటరీ సూపర్ వైజర్ బుగత వెంకటరమణకు శుక్రవారం రాత్రి ట్రు వీలేర్ స్కూటర్ పై ప్రయాణం చేస్తుండగా అనుకోకుండా ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు క్షతగాత్రుని ఆదివారం విజయనగరం శ్రీ రాముర్తు హాస్పిటల్ కి వెళ్ళి పరామర్శించారు. అనంతరం ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సంక్షేమ పథకాలు : ఎంపీపీ హైమావతి

విశాలాంధ్ర-గంట్యాడ : మండల కేంద్రమైన గంట్యాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు వివిధ శాఖలవారీగా సమీక్ష జరిపారు. పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కున్నారు. ఎంపీపీ హైమావతి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పథకాలను ప్రజలకు చేరవేయవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ఏవో శ్యామ్‌కుమార్ మాట్లాడు తూ విత్తనాలను రైతులందరికీ సక్రమంగా అందజేయడం జరిగిందని ఎరువులు కూడా అందుబాటు లో ఉంచామని చెప్పారు వైద్యాధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఈ సీజన్లో ఎక్కువగా మలేరియా , డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పంచాయతీ సెక్రటరీల సహకారంతో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాలలో నిర్దేశించిన మేరకు ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందజేయడం జరుగుతుందన్నారు ఆర్డబ్ల్యూ ఎస్ జె ఈ సునీల్ కుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీలకు ఎటువంటి సమస్యలు లేకుండా సక్రమంగా అక్కడ ప్రజలకు నీటి సరఫరా అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పి. జైహింద్ కుమార్ వైస్ ఎంపీపీలు సుజాత వెంకటలక్ష్మిఇన్చార్జ్ ఎంపీడీవో భానోజీ రావు ఎంపిటిసిలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను ఖండించిన మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మణిపూర్లో మహిళలపై జరుగుతున్న అమానుష ఘటనలను మానవహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల ఉమ ఆదివారం తీవ్రంగా ఖండించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశంలో మహిళలపై అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయని, ఇలాంటి ఘటనలు భరతమాతను అవమానపరచడమేనని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం, అలాగే అత్యున్నత న్యాయస్థానం దుశ్చర్యకు పాల్పడిన నీచులను కఠినంగా శిక్షించి, స్త్రీలకు రక్షణ కల్పించే కఠినమైన చట్టాలను అమలు చేయాలని కోరారు. ఇక మణిపూర్ లో ప్రశాంత వాతావరణం నెలకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఓట్లుచేర్పులు మార్పులపై అప్రమత్తం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చింతల

విశాలాంధ్ర-రామభద్రపురం : తెలుగుదేశం పార్టీకి చెందిన మద్దతు దారులు ఓట్లను వైకాపా కి చెందిన కొంతమంది తొలగించే పనిలో ఉన్నారని అలాంటి వారిపై తెలుగుదేశం నాయ కులు కార్యకర్తలు బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్య నిర్వహణ కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇట్లా మామిడిపల్లి జంక్షన్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం ప్రజలను ఆకట్టుకోలేక తెలుగుదేశం పార్టీ కి చెందిన సానుభూతిపరుల ఓట్లపై కన్ను వేసి అధికారుల , వార్డు వాలంటీర్లతో కుమ్మక్కయి ఓట్లను తొలగిస్తుంది అని అన్నారు. గ్రామాలలో బూత్ లెవల్ అధికారులు చేర్పులు మార్పులు కొరకు ఇంటింటికి వెళ్లి సర్వే చేయడం జరుగుతుందని సర్వే చేసేటప్పుడు కచ్చితంగా తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచులు, మండల ప్రాదేశిక సభ్యులు, నాయకులు కార్యకర్తలు వారి వెంట ఉండి ఎవరు ఓట్లు తొలగిస్తున్నారో, ఎవరు ఓట్లు చేర్పిస్తున్నారో బిఎల్ఓ లను అడగాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా మరణిస్తే కన్ఫర్మ్ చేసుకుని ఆ ఓటును తొలగించాలని అన్నారు. అలాగే చేర్పుల విషయంలో కూడా పార్టీ నాయకులు కార్యకర్తలు దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బెవర చిన్నారావు, రామభద్రపురం సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, టిడిపి నాయకులు పూడి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం : కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : క్రీడలకు, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాక్సింగ్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం తన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించిన క్రీడాకారులతో మాట్లాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, మన రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ అండర్ - 13, 17, 19 విభాగాలతో పాటు, 75-80 కేజీల విభాగం, యూత్ ఛాంపియన్షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్, రాజమండ్రి, విజయవాడ, సిక్కిం తదితర ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో గోల్డ్, బ్రాంజ్, సిల్వర్ పతకాలు సాధించారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కంటుభుక్త తవిటిరాజు, క్రీడా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సింగరాయిలో గడపగడపకు... : ఎంపీపీ దొగ్గ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయం పరిదిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు (సతీష్) తెలిపారు. ఈకార్యక్రమాన్ని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివా సరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని కావున మండలంలోని జడ్పిటిసిలు, వైస్ ఎంపీపీలు పార్టీ అధ్యక్షులు జెఎసిఎస్ కన్వీనర్ మండలంలో ఉన్నటువంటి వివిధ హోదాలో ఉన్న డైరెక్టర్లు, ఎంపీటీసీలు సర్పంచులు ముఖ్య నాయకులు సచివాలయం కన్వీనర్లు హాజరవ్వాలని ఆయన కోరారు.

కృష్ణ మాస్టార్ కుటుంబాన్ని ఎంపీ పరామర్శ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో కృష్ణమాస్టర్ కుటంబ సభ్యులను ఆదివారం విజయనగరం ఎంపి బెల్లన చంద్రశేఖర్ పరామర్శిం చారు. అతని వెంట వైస్ ఎంపీపీ సత్యనారాయణ వివిధ గ్రామ సర్పంచ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దళితులపై పెరుగుతున్న దాడులు : టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు మజ్జి

విశాలాంధ్ర-వంగర: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు, దళిత, ఆదివాసీ పథకాలను పూర్తిగా సంక్షేమ పథకాలు 28 రకాల నిలుపుదల చేశారని రాజాం నియోజక వర్గ టీడీపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి జగన్ రెడ్డి పాలన, ప్రభుత్వం పై పెద్దఎత్తున విరుచుకుపడ్డారు. ఆదివారం ఆయన వంగరలో విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చి ఎస్.సీ, ఎస్టీ ల సంక్షేమ పథకాలు నిలుపుదల చేయటమే కాకుండా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ధ్వమెత్తారు. వైసీపీ అరాచకాలకు అడ్డూ అదుపూలేకుండా పోతోందన్నారు. అధికార పార్టీ ఆగడాలకు దళితులు బలవుతున్నారని ధ్వజమెత్తారు. గత నాలుగేళ్లుగా ఎస్సీలపై దాడులు, వేధింపులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ధ్వజమెత్తారు. ఈ అరాచకాలకు ఎంతోమంది ఎస్సీలు ప్రాణాలు కోల్పోయారనీ మరెంతో మంది బాధితులుగా మిగిలిపోయారని ఆయన ప్రభుత్వ అరాచకాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడుదశాబ్దాలు గడిచినా పేద వారు పేదవారిగానే...ధనవంతుడు, కోటీశ్వరుడు గానే ఉంటున్నారని, ఈ ప్రభుత్వం జగన్ రెడ్డి అధికారం లోకివచ్చిన తరువాతను తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా, విద్యకు, విజ్ఞానానికి, ఉపాధికి, ఉద్యోగాలకు, రక్షణకు దూరంచేసి పేదలకు మరింత నష్టాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వపాలనగా ఆయన మండిపడ్డారు. గతప్రభుత్వాలు కొనసాగించిన సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేయకపోవడం తీరని అన్యాయంగా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు.

రాజకీయాలలో విలువలు జనసేన తోనే సాధ్యం

విశాలాంధ్ర-భోగాపురం: నీతివంతమైన నాయకులను ప్రోత్స హించడమే జనసేన అధినాయకుడు పవన్‌కళ్యాణ్ సిద్ధాంత మని, రాబోయే ఎన్నికలలో కాబోయే ముఖ్యమంత్రి పవన్ కల్యాణేనని జనసేన స్పోక్స్ పర్సన్ సుందరాపు విజయ్ కుమార్ అన్నారు. జనసేన నాయకురాలు లోకం మాధవి ఆధ్వర్యంలో మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం జన సైనికులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జనసేన పార్టీ జనరల్ సెక్రెటరీ పాలవలస యశస్వి, స్పోక్స్‌పర్సన్ లు సుందరాపు విజయ్‌కుమార్, రాయపాటి అరుణ, రాష్ట్ర సెక్రటరీ బోడపాటి శివధత్, ఉత్తరాంధ్ర వీర మహిళా కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్ లు మాట్లాడుతూరాబోయే ఎన్నికలలో రాష్ట్ర భవిషత్ కోసం ప్రజలు ఒకసారి ఆలోచించి జనసేనకు ఓటు వేయాలన్నారు. రాష్ట్రంలో సమస్యలకు కోసం జనసేన ప్రశ్నిస్తుంటే వైసిపి మంత్రులు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తి గత ఆరోప ణలు చేస్తున్నారని మండిపడ్డారు. సంపూర్ణ మద్య నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మద్యం అమ్మకాలు ప్రోత్సహిస్తుందని,ఈ మద్యం త్రాగి చాలామంది అమాయకులు చనిపోతున్నారన్నారు. తన కోసం దాచుకోకుండా నిస్వార్ధంగా సంపాదించినదంతా పేద ప్రజలకు ఇస్తున్న మంచి మనసున్న పవన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ,మంచి పాలన అందుతుందన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గానికి మంచి విద్యావేత్త, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, ఇక్కడ ప్రజలు అన్ని రంగాలలో ఎదగాలని కోరుకుంటున్న నాయకురాలు లోకం మాధవి అని, ఆమె అహర్నిశం జనసేన పార్టీని ప్రజలలోకి తీసువెళుతున్నారని నియోజకవర్గంలో ఆమె ఎమ్మెల్యేగా గెలవడం ఖాయం అని అన్నారు. అనంతరం వైసిపి, టిడిపి పార్టీల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన కార్యకర్తలకు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి జనసేన పార్టీ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి అవస్థలు...!

వర్షపునీరు చేరి రాకపోకలకు అంతరాయం

విశాలాంధ్ర-కొత్తవలస: కొత్తవలస జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన రైల్వే అండర్ బ్రిడ్జితో ప్రయాణికులకు అవస్థలు చెప్పలేదు. చినుకుపడితే చాలు పీకల్లోతు నీరు చేరుకుని రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వల్ల అండర్ బ్రిడ్జి నీటితో నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబ్బవరం, కే కోటపాడు వెళ్లాల్సిన వాహనాలు గంటల కొద్దీ ఆగిపోయి తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. గతంలో గేటు ఉన్నప్పుడే నయమని వాపోతున్నారు. అండర్ బ్రిడ్జిలో చేరుకున్న నీరు పోయేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని స్థానికులు కోరుచున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-శృంగవరపుకోట : గడ్డి మందు తాగి ఎస్.కోట మండలం, ధర్మవరం గ్రామ నివాసి గొర్లె సన్యాసి(48) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్.కోట పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలు ప్రకారం.. మద్యం తాగవద్దని భార్య గౌరి చెప్పినందుకు తీవ్ర మనస్థాపం చెంది ఈనెల 21న శుక్రవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో సన్యాసి గడ్డి మందు తాగాడు. అప్పటినుండి విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడని వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపజయంతోనే విజయం వరిస్తుంది

జాయింట్ కలెక్టర్ గోవిందరావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: అపజయం వెంటే విజయం వస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన వాసవి గాయత్రి విద్యాసంస్థల డిగ్రీ విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపజయంతోనే విజయం వరిస్తుంద న్నారు. అపజయం వచ్చేటప్పుడు మనోస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. చిన్నమనసు చేసుకోరాదన్నారు. ఎవరు విజయం సాధించినా ఆ విజయం వెనక కఠోర శ్రమ ఉంటుందనే విషయాన్ని మర్చిపోరాదు అన్నారు. విజయం అంత ఈజీగా సిద్ధించదనేది గుర్తెరగాలన్నారు. ప్రతి విద్యార్థి ప్లానింగ్, హార్డ్ వర్క్, వ్యక్తిగత క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పాజిటివ్ యాటిట్యూడ్ అనే పంచ సూత్రాలను పాటిస్తే విజయం తథ్యమన్నారు. అలాగే అనుకున్నది జరగకపోతే అధైర్య పడకూడదు అన్నారు. ఎందుకంటే ఏది జరిగినా మనమంచికే అనే పెద్దలమాటలను తు.చ తప్పక పాటించాలన్నారు. అపజ యం వచ్చేటప్పుడు కొంతమంది ప్రోత్సహిస్తే, కొంతమందే నిరుత్సాహ పరుస్తా రన్నారు. అవేవీ పట్టించుకోకుండా తనకు తానే మనోస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రతి అవకాశాన్ని అంది పుచ్చుకునేందుకు విద్యార్థులు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ పీవీకే మణికుమార్, ప్రిన్సిపాల్స్ ఎంవిఎస్ శర్మ, కళావతి ఏవోలు గౌరీ శంకర్ , శ్రీనివాసరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-సీతంపేట: పాతపట్నం శాసనసభ్యురాలు రెడ్డి శాంతి ఆదివారం సాయంత్రం శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మరియు ఆలయ ఉద్యోగులు ఎమ్మెల్యే ను సాధనంగా ఆహ్వానించి పూజలు జరిపి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు నిండుగా ఎమ్మెల్యే పై ఉండే విధంగా పండితులు వేదమంత్రాలతో పూజలు జరిపించి దీవించి తీర్థప్రసాదాలు అందించారు.

మణిపూర్ ఘటనను ప్రజలంతా ఖండించాలి

రౌండ్ టేబుల్‌లో వామపక్ష నాయకులు

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం సుందరయ్య భవనంలో మణిపూర్ ఘటనపై ఆదివారం వామపక్ష పార్టీల నాయ కులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మణిపూర్ ఘటనపై, మహిళలపై సామూహిక అత్యాచారాలు మానవత్వాన్ని మంటగలిపే మహిళలు నగ్న ప్రదర్శన వల్ల భారతావని సిగ్గుతో తలదించుకునే ఉందని పోరాట కార్యచరణలో చర్చించారు. సమావేశంలో సిపిఐ, సీపీఎం పార్టీల జిల్లా కార్యదర్శులు కూరంగి మన్మధరావు, రెడ్డి వేణు,లతో పాటూ జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, సిపిఐ ఎంఎల్ నాయకులు పి.శ్రీను నాయుడు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బి.నర్సింగరావు, సిపిఐ ఎంఎల్ గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్ లు మాట్లాడుతూ మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వం గిరిజన జాతుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి ఆ పేరుతో గిరిజనులు, మహిళలపై అత్యాచారాలు, మానభంగాలు, నగ్నంగా ఊరేగించడాలు, గృహ దహనాలు పాల్పడడాన్ని ప్రజలంతా ఖండించాలని, దీని వెనుక ఉన్న మైనింగ్ మాఫియా, కార్పొరేట్ కంపెనీలు ఈ దుర్మార్గాలకు తెగబడుతున్నాయని, ఈ సంఘ విద్రోహశక్తులు, వీరికి సహకరిస్తున్న వారి చట్ట పరమైన చర్యలు తీసుకొని శిక్షించాలని కోరారు. మహిళలు, గిరిజనులపైన బిజెపి రాష్ట్ర ప్రభుత్వ అండతో సాగిస్తున్న దమనకాండను మన రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతివక్ష పార్టీలు ఖండించకపోవడం చాలా విడ్డూరంగా ఉందని నాయకులు తెలిపారు. ఈ దుర్మార్గాలను ఖండిస్తూ వామపక్షాలుగా పార్వతీపురంలో జూలై 24వ తేదీ సోమవారం ఉదయం 10గం.కు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం : బేబీనాయన, చిరంజీవులు జోస్యం

విశాలాంధ్ర-సీతానగరం: రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ విజయం ఖాయమని బొబ్బిలి,పార్వతీపురం టీడీపీ నియోజక వర్గ ఇంచార్జిలు బేబీనాయన, బొబ్బిలి చిరంజీవులు తెలిపారు. మండలంలోని జోగమ్మపేట గ్రామంలో తెలుగుయువత కార్యదర్శి టంకల శ్రీనివాసరావు ఇంటివద్ద వారు విలేకరులతో మాట్లాడారు. అధికారపార్టీపై అన్నివర్గాల్లో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతుందని తెలిపారు. టీడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న అన్ని కార్యక్రమాలకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. టీడీపి కొత్తగా ప్రకటన చేసిన మ్యానీపెస్టో పట్ల అన్ని వర్గాల్లో ఆసక్తి కలిగి రానున్న ఎన్నికలలో టీడీపీ విజయం ఖాయమని సగటు మనిషి చెబుతున్నాడని వారు తెలిపారు. ఈనెల 21నుండి జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమంలో గ్రామాల్లోని నియియామించిన బూత్ లెవెల్ ఏజెంట్లు చురుగ్గా పాల్గొని ఓటర్లు పరిశీలన చేయాలని, కొత్త ఓటర్లు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కార్యక్రమాలకు,నారా లోకేష్ యువగళం యాత్రలకు పెద్దఎత్తున జనాలు తరలి రావడం చూస్తే పెద్ద ప్రభంభనం రావడం ఖాయమని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు సాల హరి, కొల్లి తిరుపతిరావు, రౌతువేణు గోపాల నాయుడు, బోను చంద్రమౌళి,బుడితి శ్రీను, సబ్బాన శ్రీను, బొమ్మినాయిని లక్ష్మణరావు,కొట్నాన రామకృష్ణ నాయుడు,ఏగిరెడ్డి భాస్కర రావు,దాసరి సింహాచలంనాయుడు, జక్కు పకీరు నాయుడు, బొత్స వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కృష్ణమూర్తి కి ఘన సన్మానం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని ఆదివారం విజయనగరం పట్టణంలో విశ్వ కళాపరిషత్, వనిత వాకర్స్ క్లబ్, గురజాడ బ్రాహ్మణ సమైక్య, 'నా ఊరు విజయనగరం'... తిలక్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణమూర్తిని ఆయా సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పల్లంట్ల వెంకట రామారావు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవకులకు సన్మానం, సమాజ అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటును అందించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, సాగునీటి చెరువుల ప్రాముఖ్యత, సమాజంపై అవినీతి ప్రభావం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి వారిని సమాజం పట్ల జాగృతి గావించడం హర్షణీయమన్నారు. కరోనా కష్టకాలం లో స్వచ్ఛంద సంస్థలు అందించిన సేవలు వెలకట్టలేనివని గుర్తు చేశారు. అందులో భాగంగా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు తనకు వచ్చిన నెలసరి ఆదాయంలో కొంత భాగం పేద ప్రజల కోసం ప్రతీ నెల ఏదో ఒక నిత్యావసర వస్తువులు ను పార్వతీపురం పట్టణం, గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజనలుకు, పేదలకు సమాజ సేవ చేస్తున్న వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కృష్ణమూర్తి చేసిన సేవలు చాలా ఆనందదాయ కమన్నారు. కృష్ణమూర్తి సమాజ సేవను ఆదర్శంగా తీసుకొని పలువురు సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం స్వచ్ఛంద సంస్థలు, రచయిత్రి కుసుమంచి శ్రీదేవి ,మ్యూజికల్ డైరెక్టర్ పివిఆర్ రాజా, లిఫ్టింగ్ హాండ్స్ సంస్థ అధ్యక్షుడు కంది గౌరీశంకర్ లను సత్క రించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రా దేవి, గురుస్వామి కందాల సాయిబాబా, చింతలపూడి త్రినాధ రావు, కొత్తల ఎర్రి నాయుడు, మమ్ముల తిరువతిరావు, టి మహేశ్వరరావు, చారి, డి సతీష్, సురేష్, బెల్లాపు సత్యనారాయణ, ఆదుర్తి రామచంద్రరావు, ఆశ్రయ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ట్రైకార్ నిధులు మంజూరు చేయండి

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం,సీతంపేట ఐటిడిఎలకు ఎన్.ఎస్.టి.ఎఫ్.డి.సి మరియు ట్రైకార్ నిధులు మంజూరుచేసి గిరిజనులకు అనేక రకాలు పరికరాలు రాయితీపై మంజూరు చేయాలని గిరిజన నాయకులు ఆరిక చంద్రశేఖర్,పల్లా సురేష్,దుక్క సీతారాం, తాడంగి సాయిబాబ,ఆరిక ప్రభాకర్ లు డిమాండ్ చేశారు.ఆదివారం వారు ట్రై కార్ జాయింట్ డైరెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో గిరిజనులకు నిధులు మంజూరు చేసేవారని, గతనాలుగు సంవత్సరాల నుండి పార్వతీపురం,సీతంపేట ఐటిడిఎలకు ఎన్.ఎస్.టి.ఎఫ్.డి.సి %డ% ట్రైకార్ నిధులు మంజూరు చేయకపోవడం వలన గిరిజనులకు ఎటువంటి పరికరాలు మంజూరు చేయడం లేదన్నారు.దీనివలన గిరిజన ఆర్థిక రుణభారం అధికంగమైందన్నారు.దీనిపై దృష్టి సారించాలని జాయింట్ డైరెక్టర్ కి కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పాముకాటుకు గురైన గిరిజన మహిళ

విశాలాంధ్ర-కురుపాం: గిరిజన మహిళ పాముకాటుకు గురైన సంఘటన మండలంలో జి. శివడ గ్రామం లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం... కె. వరలక్ష్మి అనే గిరిజన మహిళ పెరటలోకి వెళ్ళిన సమయంలో పాము కాటేసిందని వెంటనే స్థానికులు ఆమెను ఆటోలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో పాల్గొన్న వైఎస్సార్సీపీ ఏజెంట్లు



విశాలాంధ్ర -సీతానగరం: మండలంలో 35 గ్రామ పంచాయతీలో గల పోలింగు బూతు 105 నుండి 166 వరకు గల 62 బూతులకు బిఎల్ఏలను ఎమ్మెల్యే జోగారావు నియామకం చేసారని, వారంతా అప్రమత్తంగా ఉండాలని మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు తెలిపారు. పలుగ్రామాల్లో పాల్గొని ఆయా గ్రామాలలో నియమించిన బిఎల్ఏలకు తగు సూచనలు, సలహాలను ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీఆదేశాలు, ఎమ్మెల్యే జోగారావు ఆదేశాలమేరకు ఈ కార్య క్రమానికి అత్యంత ప్రాదాన్యత ఇవ్వాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఏజెంట్లను అనుమతించిందని చెప్పారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలసవెళ్ళిన ఓటర్ల వివరాలు పరిశీలన, ఓటర్ల జాబితా లో సవరణలు ఉంటే వాటిని గుర్తించడంలో బిఎల్ఏ లు కీలకపాత్రపోషించాలన్నారు. ఓటర్ల వివరాలు అంద జేతలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమం లో అన్ని గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయ కులు ఓటర్ల జాబితాలను పరిశీలనచేయాలని కోరారు.

250 మందికి జనసేన సభ్యత్వం...



విశాలాంధ్ర -మక్కువ: మండలంలో 250 మంది జనసైనికులు గా సభ్యత్వం పొందారు. వారికి మక్కువ మండలం నాయకులు గేదెల రిషవర్ధన్ చే కిట్లు అందించారు. కార్యక్రమంలో మక్కువ మండల కార్యకర్తలు చప్ప రమేష్ అల్లు శంకర్ గొట్టాపు వెంకటేష్ తవిటి రాజ్ మరియు మండలంలో ఉన్న జనసైనికులంతా పాల్గొనడం జరిగింది.

విశాలాంధ్ర

స్వాతంత్ర్య వీరులకు ఆశయ సేవా సంస్థ ఘన నివాళులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : జి.అగ్రహారం ప్రజా గ్రంథాలయం ఆవరణలో ఆశయయూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత స్వాతంత్ర్య సంగ్రామానికి బాసటగా నిలిచిన వారికి వీరులకు స్వరాజ్యం నా జన్మవాక్కు దాన్ని సాధించి తీరుతానని నినదించిన లోకమాన్య బాల గంగాధర తిలక్, విప్లవ వీర కేసరి చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా అ సంస్థ అధ్యక్షులు రెడ్డి. రమణ గ్రంథాలయ పాఠకులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి. రమణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా వారి ప్రతి అడుగూ దేశం కోసం వేసిన వారిని యావత్ భారతజాతి మరచి పోదు అని నేటి యువతరం వీరిని స్పూర్తిగా తీసుకోవాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ సభ్యులు లవీన్, యిప్పిలి హేమంత్, నితిన్, గ్రంథాలయలం పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో డీవీఎల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : విశ్వకళా పరిషత్ గురజాడ బ్రాహ్మణ సమాఖ్య నా ఊరు, వనితవాకర్స్ క్లబ్, తిలక్ ఫౌండేషన్ విజయనగరం వారు సంయుక్తంగా కనపాక యూత్ హాస్టల్లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ఎస్.కోట మండలం, భవానీనగర్ డీవీఎల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. జూనియర్ వ్యాసరచన విభాగంలో డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ ఎస్.హాసిని (7వ తరగతి) ద్వితీయ బహుమతి, సీనియర్ వ్యాసరచన విభాగంలో 9వ తరగతి చదువుతున్న తన్మయి ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వారు విద్యార్థులను సత్కరించారని డీవీఎల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ తదితరులు వెల్లడించారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి భక్తుల వితరణ

విశాలాంధ్ర-సీతానగరం: స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారికి బొబ్బిలికి చెందిన భక్తులు సుంకరపల్లి కృష్ణ చైతన్య అబ్బాయి సుంకరపల్లి జశ్విక్ దంపతులు అరకేజీ వెండిచెంబును అర్చకులు శ్రీనివాసాచార్యులకు అందజేసారు. స్వామివారి కృపా కటాక్షాలన్నీ కూడా సుంకరపల్లి కుటుంబం మీద ఉండి ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండాలని అర్చకులు తెలిపారు. స్వామివారికి వితరణగా వెండిచెంబును అందజేయడం పట్ల కృష్ణచైతన్య దంపతులకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ..

ఆలయ ప్రాంగణంలో మొక్కలునాటిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మొక్కలు పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగు తుందని, ప్రకృతిని దేవుడు మనకు అందించిన గొప్పవరం అని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం అన్నారు. ఎస్.కోట పట్టణంలోని శ్రీదారగంగమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో పుణ్యగిరి ట్రస్టు బోర్డు చైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం పూల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రిస్తూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ భావితరాలకు పచ్చని భూమిని పదిలంగా అందించడం మనందరి బాధ్యత అని, ఇందుకు గాను ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు పెంచాలని, చెట్ల నరికివేత తగదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుణ్యగిరి ఛైర్మన్ వి.రామకృష్ణ, డైరెక్టర్ సత్యసాయి, దారగంగమ్మ అమ్మవారి ఆలయ అర్చకులు రాజగోపాలాచార్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అవసరం

సీనియర్ న్యాయవాది పల్లంట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సమాజ అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు ను అందించాలని సీనియర్ న్యాయవాది పల్లంట్ల వెంకట రామారావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కనపాక యూత్ హాస్టల్లో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్వ కళా పరిషత్, నా ఊరు విజయనగరం, వనిత వాకర్స్ క్లబ్, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, తిలక్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సాగునీటి చెరువుల ప్రాముఖ్యత, సమాజంపై అవినీతి ప్రభావం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి వారిని సమాజం పట్ల జాగృతి గావించడం హర్షణీయమన్నారు. కరోనా కష్టకాలంలో స్వచ్ఛంద సంస్థలు అందించిన సేవలు వెలకట్టలేనివని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పార్వతి పురానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి , రచయిత్రి కుసుమంచి శ్రీదేవి ,మ్యూజికల్ డైరెక్టర్ పివిఆర్ రాజా, లిఫ్టింగ్ హాండ్స్ సంస్థ అధ్యక్షుడు కంది గౌరీ శంకర్ లను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రా దేవి, గురు స్వామి కందాల సాయిబాబా, చింతలపూడి త్రినాధ రావు, కొత్తల ఎర్రి నాయుడు, మమ్ముల తిరుపతిరావు, టి మహేశ్వరరావు, చారి, డి సతీష్, సురేష్, బెల్లాపు సత్యనారాయణ, ఆదుర్తి రామచంద్రరావు, ఆశ్రయ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 150 మంది విద్యార్థులు ఈ వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు.

క్లాప్ మిత్రులుకు జీతాలు అందక ఆకలు కేకలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్ మిత్రులు (పారిశుద్ధ్య కార్మికులు) కు గత తొమ్మిది నెలల నుండి జీతాలు అందక ఇప్పటికే నానా అవస్థలకు గురవుతున్నారు. మండలం లో సుమారు గా 75మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు.వేతనాలు అందక ఇప్పటికే 30శాతాం మంది విధులు నుండి మానేయటం జరిగింది. వీరు 2017 సంవత్సరం నుండి విధులు నిర్వహించడం జరుగుతుంది. ఒక్కొక్క క్లాప్ మిత్రులకు 6000 చొప్పున కార్పొరేషన్ ద్వారా గతంలో ఇచ్చేవారు. వీరు జీతాలు బాధ్యత పంచాయితీలకు ప్రభుత్వ అప్పగించటం జరిగింది. క్లాప్ మిత్రులు విధులు మానలేక చేయలేక సతమత అవుతున్నారు. వీరిది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. అందువల్ల ఇన్ని నెలల నుండి జీతాలు లేకపోయినా జీవనం గడవక పనిచేయవలసిన ఉంది. ప్రస్తుతం మీరు పరిస్థితి ఆ గమ్యగోచరం గా మారింది. అందువలన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోమని క్లాప్ మిత్రులు కోరుతున్నారు.

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకి గ్యారంటీ

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకి గ్యారెంటీ ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు "భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమం ఎస్.కోట మండలం చామలాపల్లి గ్రామంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ తొత్తడి సన్యాసయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువనేత క్రిష్ణ మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టో నినాదంతో పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని

నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలు, విడుదల చేసిన మినీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. ఒక్క అవకాశాన్ని సాకుగా చూపి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి నష్టం కలిగించి అప్పులపాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఎలాగైనా ఓడించాలని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తురన్నారన్నారు. చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన మినీ మేనిఫెస్టోతోనే వైసీపీకి ఆందోళన మొదలైందని వివరించారు. మినీ మేనిఫెస్టోలోని హామీలన్నీ ప్రజల్లోకి వెళ్లడంతో వైసీపీ నేతలు అయోమయంలో వద్దారని గొంప క్రిష్ణ వ్యాఖ్యానించారు. ఈ మేరకు మహానాడు వేదికగా మహిళలకు మహాశక్తిలో భాగంగా మేనిఫెస్టోలో 18సం. నుండి 59సం. లోపున్న ఇంట్లో ఎంతమంది మహిళలు ఉంటే అందరికీ నెలకు రూ.1,500/- చొప్పున ఇస్తామనడం, జిల్లాలోని ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందించడం, ఒక ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామనడం, ప్రతీ యేటా తల్లికి వందనంలో భాగంగా ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ

ఏటా రూ.15,000/- చొప్పున మహిళల ఖాతాల్లో జమ చేస్తామని భరోసాను ఇవ్వడం, ప్రతీ రైతుకు ప్రతి ఏటా రూ.20,000/- ఇవ్వడం, చదువుకున్న నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3,000/- అందించడం రాష్ట్ర ప్రజలకు చాలా మేలు కలుగుతుందని క్రిష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), ఆడారి రమేష్ (ఎస్.కోట టౌన్ టీడీపీ పార్టీ చీఫ్ సెక్రటరీ), జుత్తాడ రామసత్యం (మండల పార్టీ సెక్రటరీ), ఆడారి ఉమామహేశ్వరరావు (గోపాలపల్లి సర్పంచ్), గనివాడ సన్యాసినాయుడు (వినాయకపల్లి సర్పంచ్), కోరుకొండ శ్రీనివాస్ రావు (వసి మాజీ సర్పంచ్), మండా త్రినాధ్ (మామిడిపల్లి పార్టీ ప్రెసిడెంట్), మాదిబోయిన మంగరాజు (ఎస్.కోట టౌన్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు), కిలపర్తి హరి (ఎస్.కోట ఐటీడీపీ అధక్ష్యులు), గొరపల్లి ఈశ్వర్రావు (కొట్టం), కేవీ సత్యనారాయణ (ధర్మవరం), చామలాపల్లి గ్రామం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

1278 సవరణ దరఖాస్తులు స్వీకారం

పార్వతీపురం ఆర్డీఓ హేమలత

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం నియోజక వర్గ స్థాయిలో ఇంటింట ఓటరు సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 1278 సవరణ దరఖాస్తులు అందాయని పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారయిన ఆర్డీఓ కె.హేమలత తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. ఓటరు సమ్మరీ రివిజన్ లో హౌస్ టు హౌస్ సర్వే ద్వారా ఓటర్ జాబితాలో ఉన్న తప్పిదాలను - డోర్ నెంబరు "0" ఉన్నవి, జంక్ క్యారెక్టర్స్ ఉన్నవి, ఒకే ఇంటిలో పదిమంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్న వాటిని పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.వాస్తవంగా వేరే కుటుంబాలుగా ఉన్నటువంటి ఓటర్లను గుర్తించి సరిచేయడానికి, రెండు శాతంకన్నా ఎక్కువ తొలగింపులు జరిగిన పోలింగ్ కేంద్రాల వద్ద తప్పిదాలు ఏమైనా ఉన్నాయా లేవా అని చూడటానికి సర్వే చేస్తున్నట్లు తెలిపారు.ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని యువతను గుర్తించి

వాళ్ళకి ఓటు హక్కు కల్పించడానికి ఆదివారం బూత్ స్థాయి అధికారుల ద్వారా సర్వే చెయ్యడం జరిగిందని అన్నారు. ఈ సర్వే ప్రక్రియ పరిశీలించడానికి తహశీల్దార్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టారని చెప్పారు. బి.ఎల్.ఓల పనితీరు మెరుగుపడేలా ఇదివరకే శిక్షణా తరగతులను నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగాయన్నారు. ప్రతిరోజూ బిఎల్ఓ ల సర్వేను పురస్కరించుకొని, పురోగతి పై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సర్వే మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు 1278 సవరణ దరఖాస్తులు వచ్చాయని, ఆదివారం నాడు 616 దరఖాస్తులు సవరణల కోసం వచ్చాయని ఆర్డీఓ కె హేమలత తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అందరు సీరియస్ గా చేయాలని, బిఎల్ఓలు, సూపర్ వైజర్లు విధులకు హాజరు కాకపోతేకఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి జగనన్న సారధ్యంలో రాష్ట్రంలో అత్యుత్తమ పాలన

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ముఖ్యమంత్రి జగనన్న సారధ్యంలో దేశంలోనే అత్యుత్తమ పాలన రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఇక సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారిని కూడా గుర్తించి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్.కోట మండలం మామిడిపల్లి సచివాలయం వేములాపల్లి గ్రామ పరిధిలో 233వ రోజు "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, డీబీటీ విధానంలో అవినీతికి ఆస్కారం లేకుండా రైతులు, మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.2.25 లక్షల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని గుర్తు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా అందజేసిన పథకాల లబ్దిని తెలియజేయడంతో పాటు ఉన్న సమస్యలను గుర్తించేందుకు

గాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కాగా ఇంటింటి పర్యటనలో ఎమ్మెల్యే కడు బండి, నాయకులకు ప్రజ లు సాదర స్వాగతం పలి కారు. రాష్ట్రంలో జగనన్న పాలన పట్ల ప్రతి ఒక్కరు సంతోషం వ్యక్తం చేస్తున్నా రని తెలియజేశారు. ఏ గడపకు చేరినా.. ప్రతి గడపకు సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రతి గడప సంతోషంగా ఉండటమే మా ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు,మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్,%రావీజ% డైరెక్టర్ పార్వతి,వేములపల్లి లగుడు రమణ,ఎస్.కోట వార్డ్ సభ్యులు మజ్జి శేఖర్, వేమలి జగదీష్, అప్పల సత్యం, మోపాడ కోటి,ధర్మవరం అల్లు మహాలక్ష్మి నాయుడు, సీతారాంపురం సర్పంచ్ మిడతన చిన్ననాయుడు, ఉల్లి శంకర్, మండలంలో వున్న సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్టని పార్వతీపురం పురపాలక సంఘం..

తాగునీటి కుళాయిల్లో బురదనీరు సరఫరా

కుళాయిల్లో మంచినీరు సరఫరా చేయాలని కోరిన జనసైనికులు

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం పురపాలక సంఘానికి ప్రజారోగ్యం పట్టడం లేదని జనసేన పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా నాయకులు వంగల దాలినాయుడు, అన్నాభత్తుల దుర్గాప్రసాద్, కర్రి మణి, కొల్లి వెంకటరావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైందో లేదో అప్పుడే పార్వతీపురం మున్సిపాలిటీ మంచినీటి కొళాయిల్లో బురద నీరు సరఫరా ప్రారంభమైందన్నారు. ఈ బురద నీరు మళ్లీ జనవరి, ఫిబ్రవరి నెలల వరకు కంటిన్యూ అవుతుందన్నారు. ఈ బురద నీటిని తాగుతున్న ప్రజలు ఇప్పటికే టైఫాయిడ్, దగ్గు, జలుబు, గొంతు నొప్పులు, కండ్ల కలకలు తదితర రోగాలతో బాధపడుతున్నారన్నారు. గత నాలుగేళ్లుగా మున్సిపాలిటీలో మంచినీటి కొళాయిల్లో తాగునీరు అందిస్తారని ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశే ఎదురయిందని, కనీస అవసరమైన తాగునీరు అందివ్వలేని పాలన సాగుతుందన్నారు. పాలకులు, అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కనీసం తాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఒక్క పార్వతీపురంలోనే యేటి నీరు తాగటం లేదని రాష్ట్రంలో అనేక పెద్దపెద్ద పట్టణాల ప్రజలు

నదుల నీరే తాగుతున్నారన్నారు. ఆయా పట్టణాలకు బురద నీరు రాని కుళాయిల్లో పార్వతీపురంలో మాత్రం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. ఇదే వైసిపి పార్టీ ప్రతిపక్షంలో ఉండేటప్పుడు ప్రస్తుత ఎపి టిడ్కో చైర్మన్ అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో ఒకసారి కుళాయిల్లో బురద నీరు వస్తే ఆయనే స్వతహాగా బురద నీటిని మంచినీరుగా మార్చే విధానంతో ట్రైల్ రన్నర్ గా కొన్ని రోజులు బురద నీటిని, మంచినీరుగా మార్చి కుళాయిల్లో సరఫరా చేసారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పని ఇప్పుడు ఎందుకు వైసీపీ నాయకులు చేయడం లేదని ప్రశ్నించారు. గద్దెనెక్కేందుకు పలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకున్న పాలకులు ప్రజలకు మంచినీరు ఇవ్వలేని దుస్థితిలో ఉండటం సిగ్గు చేటన్నారు. ఇప్పటికే రోజు ఇవ్వాల్సిన కుళాయిలు వారానికి, ఐదు రోజులకు, నాలుగు రోజులకొక్కసారి చొప్పున ఇస్తుండడంతో పాటు ఆ ఇచ్చిన నీరు కూడా బురద నీరు ఇవ్వటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి కుంటి సాకులు, పిట్ట కథలు చెప్పకుండా ప్రజలకు మంచినీటి కుళాయిల్లో స్వచ్ఛమైన నీటిని అందించి ప్రజారోగ్యాన్ని రక్షించాలని కోరారు.

మండల వైసీపీలో మూడు స్తంభాలాట

- బయట ఐక్యతా రాగం.. లోపల వర్గపోరు...

- మండల వైసీపీ పరిస్థితిది

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడదాం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మూడు స్తంభాలాట ప్రారంభమైనట్లు తెలుస్తుంది. ఈ ముగ్గురు నేతలు బయటకు ఐక్యంగా ఉన్న లోలోపల మాత్రం ఎవరికి వారు వర్గాన్ని పోషించు కున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మండలం నుండి జడ్పిటిసి గా ఎన్నికైన మజ్జి శ్రీనివాసరావు జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎన్నికైన విషయం తెలిసిందే. అంతా ఇతను కనుసన్నల్లో జరుగుతున్న, ఆయన దగ్గర ఈ ముగ్గురు నేతలకు ఉన్న ప్రాధాన్య మిగతా నేతలకు లేదన్నది జగమెరిగిన సత్యం మండల పాలక కొలువు దీరక మందు ఒక నేత కీలకంగా వ్యవహరించేవారు. మండల పాలకవర్గము కొలువుదీరిన తర్వాత ఈయనకు కొంతమేర ప్రాధాన్యత తగ్గింది. తరవాత జరిగిన రాజకీయ పరిణామాల దృష్ట్యా ఇద్దరూ అన్ని తానై వ్యవహరించి. వర్గాలు తయారు చేయడం పెట్టడం ప్రారంభించినట్లు సమాచారం. తర్వాత వీరిలో ఒక నేత వ్యవహారశైలి బాగోలేక పోవటంతో ఆయన అనుచరులందరూ మిగిలి ఉన్న నేతవైపు వెళ్లిపోవడంతో పదవి ఉన్న ఏకాకి అయిపోయినట్లు అయింది. మిగతా వ్యక్తికి పదవు లేకపోయినా మండల రాజకీయమంతా ఆయన కనుసన్నల్లోన ప్రస్తుతం నడు స్తుంది. గ్రామస్థాయి నేతలు ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. అంతేకాక అధిష్టానం ఆశీస్సులు ఆయనకే పుష్కలంగా ఉన్నట్లు విషం వర్గాలు సమాచారం. అయినప్పటికీ ముగ్గురు నేతలు బయటకు ఒకే మాట ఒకే బాట అన్న చందానంగా కొనసాగించడం గమనార్హ మండల వైసీపీలో మూడు స్తంభాలాట కొనసాగుతుంది అన్నది జగమెరిగిన సత్యం అని చెప్పుకొనే చెప్పుకోవచ్చు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని వివిధ డివిజన్లలో చేపట్టిన ప్రారంభ, శంకుస్థాపన కార్యక్రమాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. 33 వ డివిజన్ మయూరి జంక్షన్ నుండి శ్రీనివాస కాలేజీకి వెళ్లే బిటి రహదారిని ప్రారంభించారు. 38వ డివిజన్ ఉడా కాలనీ ఫేస్ 3 శివాలయం వద్ద చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 36వ డివిజన్ వీటి అగ్రహారం మజ్జిపేట చర్చి రోడ్డు వద్ద అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మీడియాతో కార్పొరేటర్లు జివి రంగారావు, తొగురోతు సంధ్యారాణి, బాలి పద్మావతి, జోనల్ ఇన్చార్జి కుమ్మరిగంటి శ్రీనివాసరావు మీడియాతో మాటాడుతూ రూ.33 లక్షలతో మయూరి జంక్షన్ రహదారిని ప్రారంభించడం జరిగిందని అలాగే రూ.13.65 లక్షలతో 38వ డివిజన్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా శంకుస్థాపనల మాస మహోత్సవం పేరిట నెల రోజులు పాటు వివిధ డివిజన్లో ఏదో ఒక ప్రాంతంలో శంకుస్థాపనలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నగర అభివృద్ధే ధ్యేయంగా ఆయనచేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు రెడ్డి గురుమూర్తి, మారం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకార్స్ నడకమైదానంలో ఆదివారం ఉదయం క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సి.హెచ్. రమణ) నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ తల్లిదండ్రులు మన మానవాళికి ప్రత్యక్ష దైవాలని,పిల్లలకోసం,వారి అభివృద్ధి కోసం,కాయకష్టం చేసి సుఖ సౌఖ్యాలను వదులుకొని,వారి కడుపు మాడ్చుకోని పిల్లల కడుపు నింపి వారి ఎదుగుదలకు దైవానికి మించి పాటు పడతారు కనుకనే తల్లితండ్రులు ప్రత్యక్ష దైవం అని తల్లిదండ్రులను గూర్చి కొనియాడారు. అనంతరం వక్తలు క్లబ్ గౌరవ సలహాదారులు ఎ. తిరుపతిరావు, సీనియర్ సభ్యులు జనార్ధన్ రావు మాస్టారు, క్లబ్ యోగా గురువు ఎస్.చక్రధర్ పట్నాయక్, నరసింహ మూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజానికి, యువతకూ ఇటువంటి తల్లిదండ్రుల దినోత్సవాలు ఆదర్శవంతంగా కనువిప్పు కావాలని, తల్లిదండ్రుల త్యాగాలకు వారి వారసులుగా పిల్లలు రుణం తీర్చుకోవాలని,వృద్ధాశ్రమాల లేనిరోజే అసలైన తల్లితండ్రుల దినోత్సవమని అన్నారు. చివరిగా క్లబ్ సభ్యులంతా మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ,అతిథి దేవోభవ అంటూ ప్రార్థనతో కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి జి. గోవిందరావు, ఉపాధ్యక్షుడు వై.నలమరాజు, క్లబ్ పెద్దలు వల్లూరి పైడియ్య, కోట్ల ఈశ్వరరావు, ఎన్.వి.రమణ, అప్పలస్వామి, నాయుడు, ఎం.శ్రీను పాల్గున్నారు.

మహాశక్తి రథయాత్ర ప్రారంభం

విశాలాంధ్ర-కురుపాం: మహాశక్తి రథయాత్ర వాహనంను కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మేజర్ పంచాయతీ పరిదిలోగల గాంధీ నగర్ లో మహాశక్తి ఇంటింటికి ప్రచారం చేపట్టారు. తెలుగు దేశం పార్టి పాలనలో కి వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలు చేకూరబోయో లబ్ధి మహిళలు కు వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదుమండలాలు నాయకులు వీరేష్ చంద్రదేవ్,రమణకుమార్, కెవికొండయ్య, డొంకాడ రామకృష్ణ, మంగమ్మ, నంగిరెడ్డి మధుసూదనరావు, శేఖర్ పాత్రుడు, పావణి, మర్రాపు పురుషోత్తం, పొట్నూరు వెంకటనాయుడు ,వెంపటాపు భారతీ ,పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం రేషన్ షాపు డీలర్ రాజు మృతి

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలోని సీతానగరం-1 నిత్యావసర సరుకుల పంపిణీ షాపు డీలర్ సవరపు రాజు(65) ఆదివారం విశాఖలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన ఎంతో కాలం నుండి సీతానగరంలో డీలరుగా పనిచేస్తూ అందరితో మంచిని పంచుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ కమీషన్ మెంబర్ సవరపు జయమణి ,పార్వతీపురం ఎమ్మెల్యే అలజింగి జోగారావు, సవరపు రామారావు మాస్టారు, మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, సీతానగరం, పెదబోగిలి, అప్పయ్యపేట గ్రామ పెద్దలు, మండలంలోని రేషన్ షాపుల డీలర్లు, రెవెన్యూ సిబ్బంది ప్రగాఢ సంతాపంను వ్యక్తం చేశారు.

మణిపూర్ లో శాంతిని నెలకొల్పాలి

క్రిస్టియన్, ముస్లింల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్ : మణి పూర్ రాష్ట్రంలో గత 80 రోజులుగా సాగు తున్న విధ్వంశకాండను నిరసిస్తూ, అక్కడ సత్వరమే శాంతిని నేలకొల్పాలని డిమాండ్ చేస్తూ విజయనగరం క్రిస్టియన్, ముస్లింల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఆదివారం సిమ్స్ చర్చలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో డిస్ట్రిక్ క్రిస్టియన్ వెల్ఫేర్ కార్యదర్శి సంఘ మిత్ర డాక్టర్ ఆర్ ఎస్ జాన్, బిషప్ కేజే ఫీలోమాన్, ముస్లిం ప్రతినిధులు అబీబ్, అహిబ్, రఫీ హిందూ ధార్మిక సంస్థ ప్రతినిధిగా పద్మనాభం, ఉత్తరాంధ్ర సమతాసైనిక్ దళ్ కన్వీనర్ అశోక్ అంబేద్కర్, సిటూ ప్రతినిధి రమణమ్మ, ఉత్తరాంధ్ర అంబేద్కర్ రైట్స్ ప్రతినిధి పాండ్రంకి వెంకట్ రమణ, టి ఆనంద్, వైసీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా విభాగం అధ్యక్షురాలు ఆశా జాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా మణిపూర్ విధ్వంసం వెనుక ఆ రాష్ట్ర, కేంద్ర బీజేపీ ప్రభుత్వాల కుట్ర దాగి ఉందని సమావేశానికి హాజరైన వక్తలంతా ఆరోపించారు. ఇదంతా మతోన్మాద శక్తుల కూటమి వల్ల జరుగుతున్న దారుణాలుగా అభివర్ణించారు. మణిపూర్లో శాంతికొల్పి, ప్రజల జీవన స్థితిగతులకు సాధారణ పరిస్థితులను కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

31న చలో కలెక్టరేట్ గోడ పత్రికలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు జూలై 31న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఎస్.కోట పట్టణంలోని మహాత్మాగాంధీ పార్కులో ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటీయు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి నెలకు పదివేల రూపాయలు జీతం ఇవ్వాలని, నిరంతరం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని, రేషనైజేషన్ పేరుతో స్కూల్స్ విలీనం చేయడం వలన ఉపాధి కోల్పోతున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్ పెంచాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ చార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటెంతో ప్రభుత్వం మెనూ తయారుచేసి పిల్లలకు పెట్టాలని వర్కర్లపై భారాన్ని మోపిందన్నారు. ఒకపక్క పని భారం.. మరో ప్రక్క ధరల భారంతో పెరగని వేతనాలు మెనూ ఛార్జీలతో కార్మికులు పథకం నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రింది డిమాండ్ లో పరిష్కారం కోసం జూలై 31న అనగా సోమవారం కలెక్టరేట్ ఆఫీస్ వద్ద జరుగు ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు, నిర్వాహకులు పాల్గొవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ పిలుపునిచ్చారు. రేషనైజేషన్ పేరుతో స్కూల్స్ విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న వర్కర్లకు ఉపాధి పద్ధతి కల్పించాలి, పథకంలో పనిచేస్తున్న వారందరినీ కార్మికులుగా గుర్తించి గౌరవ వేతనం 10000 రూపాయలు ఇవ్వాలి, ప్రతి నెల 5వ తేదీ లోపు గౌరవ వేతనం బిల్లులు చెల్లించాలి. హై స్కూల్లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలి. నిరంతరం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలి. వంట గ్యాస్ ప్రభుత్వమే సప్లై చేయాలి. వంటశాలలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి. బకాయి ఉన్న 12 నెలల వేతనాలు చెల్లించాలి. యూనిఫామ్ గుర్తింపు కార్డులు, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదని, ఉద్యోగ భద్రత కల్పించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. రాగి జావ తయారీకి కావలసిన వంట పాత్రలు, గ్యాస్ స్టవ్ ప్రభుత్వమే సరఫరా చేయాలని వారి డిమాండ్లను మద్దిల రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల కమిటీ అధ్యక్షులు ఎర్ర దేవుడమ్మ, ఉపాధ్యక్షులు అనకాపల్లి భవాని, కమిటీ సభ్యులు సిహెచ్ రాఘవి, వి.వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల సాకారం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పునరుద్ఘాటించారు. ఆదివారం గుంకులంలో 730 మందికి ఇళ్ల పట్టాలను అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పట్టాలను అందించి త్వరగా ఇల్లు నిర్మించుకునే విధంగా చొరవ చూపాలని సూచించారు .అవసరమైన మౌలిక సదుపాయాలను చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో పట్టాలు పొందే అర్హత ఉన్నప్పటికీ కొన్ని కారణాలవల్ల గతంలో మంజూరు కాలేని వారికి ప్రస్తుతం 730 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత ప్రజలందరూ బాగుండాలి, వారికి ధైర్యంగా భరోసానిచ్చే విధంగా పరిపాలన సాగాలని నూతన ఒరవడిని తీసుకొచ్చారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు తో పాటు గృహ వసతి కూడా కల్పించాలనేది ఆయన ధ్యేయమని అన్నారు. దురదృష్టవశాత్తు కరోనా విస్తరించి రెండు ఏళ్ళు పాటు కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి అన్ని రంగాలను అభివృద్ధి పరిచే దిశగా ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ పాలను సాగిస్తున్నారన్నారు. సొంత ఇల్లు లేనివారికి డిసెంబర్ 2020న 13,000 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొంతమందికి కొండ కరకాంలోనూ, సారికలనూ, గుంకులంలోనూ మంజూరు చేయగా ఇంకా మిగిలి ఉన్నవారు కి త్వరలో జమ్ము ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాలనలో ఎక్కడ అవినీతి లంచగొండితనం లేకుండా సాగుతుందన్న విషయం గుర్తించాలన్నారు. గుంకలం లేఔట్ లో గొడౌన్ల నిర్మాణం, మంచినీటి సదుపాయాలు, 33 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు, కరెంటు స్తంభాలు, వైర్లు, లైట్లు వేయడం, సైట్ లెవెలింగ్ చేయడం, రోడ్లు ఏర్పాటు చేయడం వంటివి చేపడుతున్నా మన్నారు. శతశాతం ఇల్లును త్వరగా నిర్మించుకున్నట్లయితే సంపూర్ణ మాలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎంత త్వరగా ఇల్లు నిర్మించుకుంటే అంత త్వరగా సౌకర్యాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రజల సుఖ సంతోషాలే ముఖ్యమంత్రి లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్,సహాయ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్చార్జిలు, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, తహసిల్దార్ శ్రీనివాసరావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా ఏకం కావాలి : వైరిచర్ల వీరేష్ దేవ్

విశాలాంధ్ర - కురుపాం : కురుపాం నియోజకవర్గ వర్గం లో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో విజయడంకా మ్రోగించాలని యువ నాయకుడు వైరిచర్ల. వీరేష్ చంద్ర దేవ్ కోరారు. ఆదివారం తన నివాసంలో కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై అంతా సమన్వయం తో ఐక్యం గా పనిచేసీ కురుపాం నియోజకవర్గంలోపార్టీ గెలుపుకు కృషి చేద్దామని అన్నారు. ఈ సమావేశం తెలుగుదేశం పార్టీ గెలుపుకు పునాది కావాలన్నారు. పార్టీ బలోపేతం కోసం తానూ అహర్నిశలు కృషి చేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా అని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యల పై రానున్న రోజుల్లో బలంగా పోరాడుదామని ఈ సందర్భంగా ఆయన తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రదీప్ దేవ్, నియోజకవర్గ ఇన్చార్జి తోయక. జగధీశ్వరి, ఐదుమండలాలు నాయకులు శేఖర్ పాత్రుడు , పావణి, మత్రాపు. పురుషోత్తం, పొట్నూరు వెంకట నాయుడు, నంగిరెడ్డి మదుసూధన్, బత్తిలి శ్రీనివాస్, వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో టీడీపీ నేతల పర్యటన

విశాలాంధ్ర - పార్వతీపురం : మండలంలోని గుడారివలస, ఎగువఅడారు, దిగువ ఆదారు, కొత్త అడారు, గేదగుమ్మివలస, జిల్లెడువలస మొదలగు గిరిజన గ్రామాల్లో ఆదివారం నాడు టీడీపీ నేతలు పర్యటించి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మహాశక్తి పథకంలోని అంశాలను గిరిజనులకు వివరించారు. మహాశక్తిలోని పథకాలు మనకి అందాలి అంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయవలసిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో గొట్టాపు.వెంకట నాయుడు , మాజీ సర్పంచులు సాయిబాబా, గోరజాన.లక్ష్మణరావు, శేఖర్, అదారు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నంపేట పంచాయతీలో 'మహాశక్తి'

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లామక్కువ మండలం ఏ.వెంకంపేట ఎంపీటీసీ పరిధిలోని కన్నంపేట పంచాయతీ లో మహాశక్తి కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ లాయర్ రామకృష్ణ గారి ఆధ్వర్యములో ప్రచారం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతినిధి పెంట తిరుపతి రావు , ఇటీవల బీజేపీ రాష్ట్ర ఎస్ .టీ . మోర్చా కార్యదర్శి పదవికి రాజీనామా టీడీపీ లో చేరిన హిమారక ప్రసాద్ గారు , ,వి బి పురం మాజీ సర్పంచ్ పరమహంస గారు ,మూడడ్ల పారి నాయుడు ,చప్ప బుచ్చింపేట మాజీ సర్పంచ్ చప్ప తిరుపతి నాయుడు , కోన సర్పంచ్ ప్రతినిధి , గ్రామా పార్టీ అధ్యక్షులు మరిపి అప్పలనాయుడు మరియు గ్రామ నాయకులు పాల్గొని వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడపటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు , ఓటర్ వెరిఫికేషన్లో పాల్గొనవలసి అవసరంవిషయాలు చర్చించటం జరిగింది.

జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా లక్ష్మణరావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : మన్యం జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ గా సిహెచ్ లక్ష్మణరావు భాద్యతలు చేపట్టారు.ఈయన ఇప్పటివరకు విజియనగరం రెండవ పట్టణ సిఐగా విధులు నిర్వహించారు. గతంలో ఈయన పార్వతీపురం సర్కిల్ ఇన్సపెక్టర్గా విధులు నిర్వహించడం తో ఈ ప్రాంతంపై పట్టు ఉంది. ఇప్పటి వరకు స్పెషల్ బ్రాంచ్ సీఐ గా విధులు నిర్వహించిన యం.శ్రీనివాసరావు విఆర్ కు బదిలీ పై వెళ్లారు.

మరిపివలస ఆలయంలో చోరీ

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని మరిపివలస గ్రామంలోని శ్రీ భువనేశ్వర స్వామి ఈశ్వరఆలయంలో ఆదివారం మధ్యాహ్నం శివాలయంలో ఉన్న ఇత్తడి సామాన్లు, అయ్యప్ప పానమట్టం చోరీకి గురయ్యినట్లు ఆలయ అర్చకులు దేవల్ల సురేష్ పిర్యాదు చేశారు. ఆలయ తలుపులు దగ్గరకు వేసి ఉండటంతో తలుపుతీసి దొంగలించారని తెలిపారు.దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును పరామర్శ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును తప్పెట గుళ్ళు కళాకారుల సంఘం సభ్యులు శనివారం పరామర్శించారు. జిల్లా యాదవ సంఘం సభ్యులు పడగల బంగార్రాజు యాదవ్ ఆధ్వర్యంలో తప్పేటగుళ్ళ కళాకారులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించిన అనంతరం దివంగత మజ్జి నర్సింగరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పడగల బంగార్రాజు మాట్లాడుతూ దివంగత నర్సింగ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన పేరిట సంస్థ ను స్థాపించి మరిన్ని అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ను కోరారు. ఈ కార్యక్రమంలో తప్పెట గుళ్ళు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు సరాబోని శంకరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని పోలింగ్ స్టేషన్ 14లో ఓటరు జాబితాపై తహ శీల్దార్ డి.శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో రెవెన్యూ సిబ్బంది శనివారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లా డుతూ తప్పులు లేని ఓటరు జాబితాలు తయారు చేయడంలో భాగంగా ఇంటింటి సర్వే చేస్తున్నా మని, ఏ ఒక్కరి ఓటు తొలగిపోకుండా చూస్తామని స్పష్టం చేశారు. అలాగే ఓకే ఇంటి నెంబరుతో ఎక్కువ ఓట్లు ఉండటం, మృతి చెందిన వారివి, ఇక్కడ నివసించని వారి నకిలీ ఓట్లు తొలగిస్తామని, అలాగే ఏ ఒక్కరి ఓటు కూడా పోకుండా సిబ్బంది ఇంటింటి సర్వే చేసి జాబితా రూపొందిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసరావు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరుకి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం నడిమి ములగ గ్రామానికి చెందిన మడక ఉదయ్ కుమార్ వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం ఉదయం తన స్నేహితుడు సురపాటి చంటితో కలసి మోటార్ సైకిల్ పై బొబ్బిలి వెళ్తుండగా మార్గమధ్యలో తాన్న సీతారాంపురం కూడలి వద్దకు వచ్చేసరికి సీతానగరం నుండి పార్వతీపురం వైపు వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో మోటార్ సైకిల్ పై నుండి తుళ్ళి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఉదయ్ కుమార్, చంటిలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన ఇద్దరినీ 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

102, 104, 108 సిబ్బందికి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - బెలగాం : 102, 104, 108 వాహనాల జిల్లా ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు ఆదివారం 102, 104, 108 వాహనాల పైలట్లకు జిల్లా ఆసుపత్రికి సమీపంలో ఉన్న రెవెన్యూ హెూంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాల కండిషన్ ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదయినా మేజర్ ప్రాబ్లమ్స్ ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. వాహనాల అన్ని రికార్డులను, ఫిట్ నెస్ ను, వాటి పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తరలిస్తున్న రోగులకు మంచి సేవలను అందించాలని సూచించారు. వాహనాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 102, 104, 108 సేవల పట్ల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ మన్మధనాయుడు, 102, 104, 108 ఆపరేషన్ ఎక్సిక్యూటివ్ విజయకుమార్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్, తిలక్‌లకు నివాళులు

విశాలాంధ్ర - సీతానగరం : తెల్ల దొర గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన అసమానవీరుడు చంద్రశేఖర్ అజాద్ 117వ జయంతితో పాటు" స్వరాజ్యం నాజన్మ హక్కు"అని నినదించిన భారత జాతీయోద్యమ నేత బాల గంగాధర్ తిలక్ 167వ జయంతి పురస్కరించు కుని ఆదివారం నాడు గెద్దలుప్పి కూడలిలోని కృషి విద్యానికేతన్ విద్యార్థులు వారి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో వారుచేసిన ఉద్యమాలు, వారు నడిపిన నాయకత్వం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ద్వారపురెడ్డి శ్రీనివాసరావు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు రావు శ్రీనివాస్‌రావు జనసేన పార్టీ గౌరవ సత్కారం

విశాలాంధ్ర - బొబ్బిలి : ఆదివారం పోలీసు క్రీడా ప్రాంగణంలో అగ్నివథ్, ఆర్మీ రిక్రూట్మెంట్‌కి సంబంధించి శిక్షణ ఇస్తున్న రావు శ్రీనివాస్‌రావు మాస్టారుకి బొబ్బిలి జనసేన పార్టీ తరపున సత్కరించారు. రిటైర్డ్ ఎస్బిఐ ఉద్యోగి గణపతిని జనసేన పార్టీ తరుపున గౌరవంగా సత్కరించడం జరిగింది. యువతను ఉద్దేశించి రావు శీను వాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు డిఫెన్స్ ఉద్యోగాలుకు 60 మంది ఎంపికయ్యారని ప్రభుత్వం చొరవ తీసుకోని బొబ్బి లిలో శిక్షణకి అనువైన మౌలిక సదుపాయాలుతో శాశ్వత గ్రౌండ్‌ని అందుబాటులోకి తేస్తే మన ప్రాంతం నుంచి మరింత మంది యువతకి శిక్షణ ఇచ్చి ప్రయోజకులుగా మార్చ డానికి దోహదపడగాలనని, యువతను ఎంతగానో ప్రేరేపిస్తున్న జనసేన పార్టీ ఈ విషయంలో తమ వంతు కృషి చేయాలని శ్రీ రావు శ్రీనివాస్ కోరారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ బాబు పాలూరి మాట్లాడుతూ 70 ఏళ్ల వయసులో కూడా రావు శ్రీనివాస్ మన ప్రాంత యువత భవిష్యత్తు కోసం చాలా ఆలోచించి తమ పూర్తి సమయాన్ని డిఫెన్స్ ఉద్యోగాలుకు ప్రిపేర్ అవుతున్న యువత కోసం కేటాయించడం చాలా స్ఫూర్తిదాయకం. తరువాత యువతను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రమ శిక్షణతో స్పోర్ట్స్, డిఫెన్స్, ఎడ్యుకేషన్, కెరీర్‌పైన పూర్తి స్థాయిలో దృష్టి సారించి ప్రయోజకులై మన రాష్ట్ర, దేశ పురోగతిలో భాగస్వామ్యులు అవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే సమాజంలోని అసమానతలు, ప్రభుత్వ వ్యవస్థలోని లోపాలు, ప్రజా సమస్యలును సరి చేయడానికి యువత ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్ ,ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ రమేష్ చౌదరి,గేదెల శివ, ఎందవ సత్య తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో రీల్స్ చిత్రీకరణ ప్రారంభం

విశాలాంధ్ర - బొబ్బిలి : ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో 'రీల్స్' లఘు చిత్రాల నిర్మాణం కోసం పాత్రధారుల ఎంపిక ఆదివారం ఉదయం కళాభారతి కళావేదికలో నిర్వహించారు. అధ్యక్షుడు యం.విజయ మోహన్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల బాలికల లోవున్న నటన, నృత్యం వంటి కళల నైపుణ్యాన్ని వెలికి తీసే విధంగా రీల్స్ పేరుతో నిమిషం పాటు ఉండే లఘు చిత్రాలను ఆనందోబ్రహ్మ కోఆర్డినేటర్ కరుణకుమార్ దర్శకత్వంలో నిర్మిస్తున్నామన్నారు. ఇందుకు బొబ్బిలిలో పలు ప్రాంతాలలో పలుచోట్ల షూటింగ్ జరుగుతుందన్నారు. ప్రతి ఆదివారం చిత్రీకరణ జరిపే ఈ రీల్స్ లఘు చిత్రాలలో నటించేందుకు చిన్నారులతో పాటు పెద్దలకు కూడా అవకాశం కల్పిస్తున్నామన్నారు. నటన పట్ల ఆసక్తి ఉన్నవారు తమను 9440744741లో సంప్రదించాలని కోరారు.

క్రీడల్లో సత్తా చాటిన కేవీ విద్యార్థిని..అభినందించిన ఉపసభాపతి కోలగట్ల

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్ : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏపీ తెలంగాణ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ రీజినల్ క్రీడా పోటీల్లో విజయనగరానికి చెందిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థిని సత్తా చాటింది. అండర్ - 17 విభాగంలో 9వ తరగతి చదువు తున్న పి.విశ్వకృప డిస్కస్‌త్రోలో బంగారు, రిలేలో కాంస్య పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం ఏపీ శాసనసభ ఉపసభాపతి, విజయనగరం శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామిని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్న కోలగట్ల.. ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, మరిన్ని పతకాలు సాధించాలని.. తద్వారా ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నాలుగు కేజీల గంజాయితో సాధువు అరెస్టు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నాలుగు కేజీల గంజాయితో ఒక సాధువుని పోలీసులు అదుపులోకి తీసుకుని శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.కోట ఏఎస్ఐ వెంకటరమణకు రాబడిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర్లో ఆచార్య ప్రదీప్ కుమార్ అనే సాధువు గంజాయి రవాణా చేస్తూ ఉండగా పట్టుబడ్డాడు. అతని వద్ద 4 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మణిపూర్ ఘటనలను ఖండించిన జిల్లా దళిత సంఘాలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నగ్న ఊరేగింపులు, హత్యలను ఎస్.కోట మండలం, కొట్టాం గ్రామానికి చెందిన జిల్లా దళిత సంఘాల నాయకులు తెరపల్లి కోటరావు, గుర్రపు శ్రీనివాసరావు, జైభీమ్ యూత్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళలను నగ్నంగా ఊరేగించటం, అత్యాచారాలు చేయటం, చంపటం చాలా ఘోరం, అమానుషం అని ఆందోళన వ్యక్తం చేశారు. మనం మనుషులమేనా, రాక్షసులమా.. అసలు ఏ యుగంలో ఉన్నామని, అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి. మహిళలను పూజించి, గౌరవించే దేశం, సంస్కృతి మనదని పేర్కొన్నారు.

విశాఖకు బదిలీపై వెళ్లిన సర్కిల్ ఇన్స్పెక్టరుకి ఘన సన్మానం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పోలీసు సర్కిల్ పరిధిలో సర్కిల్ ఇన్స్పెక్టరుగా పనిచేసి విశాఖకు బదిలీపై వెళ్లిన ఎస్. సింహాద్రినాయుడుని స్పార్టాన్ ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షటిల్ క్రీడాకారులు రేగలబంధ అప్పారావు, మోపాడ నాయుడు, ఆర్టీసీ కోటేశ్వరరావు, సురేష్ మాస్టర్, రెడ్డి శివకుమార్, వర్మ, రాంబాబు తదితరులు మాట్లాడుతూ సీఐగా మూడేళ్ల పాటు ఎస్.కోట సర్కిల్ లో పనిచేసిన సింహాద్రినాయుడు ఎంతో సౌమ్యుడుగా పేరు గాంచారని గుర్తు చేశారు. సీఐగా ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ నడక, షటిల్ వంటి సాధనలో రోజూ పాల్గొంటు సింహాద్రినాయుడు పలువురు యువకులకు ఆదర్శంగా నిలిచారని, అలాగే గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిని పట్టుకుని కేసులు నమోదు చేయడంలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారంటూ కొనియాడారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో పాల్గొన్న టీడీపీ బీఎల్ఏలు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో 35గ్రామపంచాయతీలో గల పోలింగు బూతు లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు రౌతు వేణు గోపాల నాయుడులుతెలిపారు. పలుగ్రామాల్లో వారు పాల్గొని ఆయాగ్రామాలలో నియమించిన బిఎల్ ఏలకు తగు సూచనలు, సలహాలను ఇస్తున్నట్లు చెప్పారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్ళిన ఓటర్ల వివరాలు పరిశీలన, ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే వాటిని గుర్తించడంలో బిఎల్ఏ లు కీలకపాత్ర పోషించాలన్నారు.చిరునామాను మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్ అడ్రస్ వెరిఫికేషన్ ఓటర్లు వివరాలు పరిశీలన చేసి బి ఎల్ ఓ లకు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్ల వివరాలు అందజేతలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలా ఉండగా అప్పయ్యపేటలో జరిగిన జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ సబ్బాన శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏమమ్మా.. ప్రభుత్వ పథకాలు అందాయా?

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 24వ డివిజన్ పరిధి బూర్లెపేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వర్షంలోనూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేపట్టారు. ఇంటింటికీ వెళ్తూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. పథకాలు పొందడంలో ఇబ్బందులు ఏమన్నా ఉన్నాయా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అంటూ ఆరా తీశారు. పూర్తి పారదర్శకంగా సంక్షేమ లబ్ధి కలిగిందని స్థానికులు ఆమెకు వివరించారు. కొంతమంది కాలువల సమస్యను తీసుకురాగా.. వెనువెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. కొన్నిచోట్ల రహదారులు, డ్రెయిన్లు అవసరమని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ నడిపేన శశి భార్గవి, కార్పొరేటర్ పిల్లా రాధా భవాని, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా ఆద్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - బెలగాం : మణిపూర్ రాష్ట్రంలో మహిళలను వివస్త్రలను చేసి, కిరాతకంగా, క్రూరంగా ప్రవర్తిస్తున్న వారిపై కఠినచర్యలు చేపట్టాలని మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం ఉదయం సుందరయ్య భవనంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఆద్వర్యంలో సమా వేశం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది టి. జోగారావు, ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాస్టారు, సిఐటీయు జిల్లా నాయకులు, వి. ఇందిర, యుటియఫ్ మండల నాయకులు బంటు జగన్నాధం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు, రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు రాజు, ఐద్వా పట్టణ నాయకులు గెద్ద తులసి, ఆర్.పి.ల సంఘం నాయకులు రెడ్డి సుజాత, లక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు, న్యాయవాది వెంకటేశ్వర్రావు, పాల్గొని మహిళలపై దాడులను ఖండించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతు ఈ నెల 29వ తేదీన సాయంత్రం 5 గంటలకు పట్టణంలో జరుగు బస్సుయాత్రను, ఆగస్టు 9వ తేదీన విజయవాడలో జరుగు బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు.

చదవడం మాకిష్టం కార్యక్రమం

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో స్థానిక గ్రంథాలయం లో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యమాన్ని విద్యార్థి, విద్యార్థులు తో అరేబియన్ నైట్స్ కథలు , కాకమ్మ కథలు , అక్బర్ బీర్బల్ కథలు , నవరత్న రాణుల కథలు మరియు నీతి కథలు చదివించడం , చెప్పడం జరిగింది.మరియు చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని స్థానిక గ్రంథాలయ అధికారి సి. హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.